
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం। 28। మార్చి। 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1960, మధ్య డెల్టాకు 1275, పశ్చిమ డెల్టాకు 3400 క్యూసెక్కుల నీటిని వదిలారు.




కోనసీమ తిరుపతి అభివృద్ధికి ప్లాన్

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి రూ.55 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. -8లో▶

మల్లమాంబకు రజత కిరీటం



ఐ.పోలవరం: కేశనకుర్రు గ్రామ దేవత మల్లమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన పిన్నంరాజు ప్రసాద్‌రాజు సుమారు రూ.లక్ష విలువైన రజత కిరీటం సోమవారం బహూకరించారు.



సహకార పీఠాలకు కదలిక

- పీఏసీఎస్‌లలోనూ ఇక బదిలీలు
- తిష్ట వేసిన ఉద్యోగులకు స్థానచలనం
- త్వరలో జిల్లా స్థాయి కమిటీ భేటీ
- 3 నెలల్లో తుది నిర్ణయం
- సొసైటీల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సహకార సంఘాల్లో ఒకే చోట ఏళ్ల తరబడి పని చేస్తామంటే ఇకపై కుదరదు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) పని చేసే ఏ స్థాయి ఉద్యోగికైనా బదిలీ తప్పదు. నిర్దేశించిన మూడేళ్ల కాలపరిమితి దాటిన ప్రతి ఒక్కరూ బదిలీ కావాల్సిందే. నియామకం దగ్గర నుంచి ఉద్యోగ విరమణ వరకూ ఒకే సొసైటీలో పని చేస్తున్న విధానం ఇంతవరకూ కొనసాగుతోంది. సహకార సంఘాలు వేలాది మంది రైతుల ఆర్థిక లావాదేవీలతో ముడుకున్న వ్యవస్థ. బదిలీలు లేకపోవడంతో సొసైటీలు కోట్లాది రూపాయల కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ ఏలుబడిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కోట్లాది రూపాయల మేర అవినీతి, అక్రజుమాలు చోటుచేసుకున్నాయి.

అక్రమాల కట్టడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఎపీసీఎస్‌లలో ఏళ్ల తరబడి ఉద్యోగులు తిష్ట వేయడమే ఈ అవినీతికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇందుకు విరుగుడుగా ఇప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లు, వాటి బ్రాంచిలలో అమలు చేస్తున్న హెచ్‌ఆర్ పాలసీ అమలులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌లలో ఎంత మంది ఉద్యోగులు, ఎంత కాలం నుంచి పని చేస్తున్నారు, ట్రాక్ రికార్డు వంటి అంశాలపై తాజాగా ఆరా తీస్తున్నారు. వేళ్లూనుకుపోయిన అవినీతి అక్రమాలకు కళ్లెం వేయనున్నారు.

వివిధ విషయాలపై భేటీ

పీఏసీఎస్‌లలో బదిలీలపై త్వరలో జిల్లా స్థాయి అమలు కమిటీ భేటీ కానుంది. కమిటీలో డీసీసీబీ చైర్మన్, సీఈఓ, జిల్లా సహకార అధికారి సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘాల ఉద్యోగుల బదిలీలు, సర్వీసు రూల్స్, నష్టాల్లో ఉన్న సంఘాల ఉద్యోగులకు జీతాల చెల్లింపు, రెండేళ్లలో తిరిగి చెల్లించేలా అడ్వాన్సులు ఇవ్వడం తదితర అంశాలపై చర్చించనున్నారు. తరువాత హెచ్‌ఆర్ పాలసీపై కమిటీ ఒక నిర్ణయానికి రానుంది. ప్రస్తుతం డీసీసీబీల్లో బ్రాంచి మేనేజర్ నుంచి సూపర్‌వైజర్ల సహా అన్ని క్యాడర్ల వారికీ బదిలీలు జరుగుతున్నాయి. ఎటొచ్చీ పీఏసీఎస్‌లలో ఉద్యోగులకే బదిలీలు లేవు. ఫలితంగా రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ఈ సహకార సంఘాల్లో అవినీతి రాజ్యమేలుతూ వస్తోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...

సహకార సంఘాలు	: 299
నష్టాల్లో ఉన్న సంఘాలు	: 100కు పైనే
సంఘాల్లో ఉద్యోగులు	: 1350 మంది

కసరత్తు ప్రారంభం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వద్దిపర్రు, రావులపాలెం, రామచంద్రపురం; కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, లంపకలోవ, కిర్లంపూడి, గోకవరం, సీతానగరం, కానవరం, గండేపల్లి, జగ్గంపేట, భూపాలపట్నం తదితర సహకార సంఘాల్లో బినామీ పేర్లతో రికార్డులు తారుమారు చేసి కోట్లాది రూపాయలు దారి మళ్లించి, రైతుల నోట మట్టి కొట్టిన బాగోతాలు తెలిసిందే. గత చంద్రబాబు సర్కార్‌లో జరిగిన ఈ కుంభకోణాల్లో డీసీసీబీ పాలకవర్గం సహా సీఈఓ, ఇతర ఉన్నతాధికారుల పాత్రపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 51, సీఐడీ విచారణకు ఆదేశించింది. సీఈఓ సహా పలు స్థానాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్ట వేయడమే ఇందుకు కారణమని ప్రభుత్వం గుర్తించింది. సంఘాల స్థాయిలోనే ప్రక్షాళన జరగాలంటే ఉద్యోగుల బదిలీలకు రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌ఆర్ పాలసీ తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు చేపట్టిన కసరత్తు మే లేదా, జూన్ నెలాఖరుకు కొలిక్కి వస్తుందని సమాచారం.



లంపకలోవ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం

అడ్డుకట్టకు దోహదం



పీఏసీఎస్‌లలో హెచ్‌ఆర్ పాలసీ తీసుకురావాలనేది ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం. సహకార వ్యవస్థలో క్షేత్ర స్థాయిలో అవకతవకలు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇది దోహదపడుతుంది. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా సొసైటీలలో బినామీ రుణాలతో రైతులను నిలువునా ముంచేసిన వ్యవహారాలకు ఈ పాలసీ లేకపోవడమే ప్రధాన కారణం. ఇది ఎప్పుడో జరగాల్సింది. ఈ విషయాన్ని గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లాం. త్వరలో ఇది అమలులోకి వస్తుందని ఎదురు చూస్తున్నాం.

– జున్నూరి వెంకటేశ్వరరావు (బాబీ), రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు

కోటసత్తెమ్మ హుండీ ఆదాయం రూ.28.18 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. నగదు రూపంలో రూ.28,18,577, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.93,728, 24 గ్రాముల బంగారం, 587 గ్రాముల వెండి ఉన్నట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. 88 రోజులకు సంబంధించి తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ కమిటీసభ్యులు, సిబ్బంది హుండీలోని నగదును లెక్కించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కరరావు, ఉర్ల వీరవెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, నిచ్చెనకోల భవానీ, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగవైకల్య నిర్ధారణ శిబిరాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల వైకల్యం నిర్ధారణకు మంగళ, బుధవారాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. వైకల్య నిర్ధారణ పూర్తయ్యాక, అవసరమయ్యే ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరానికి హాజరయ్యే పిల్లలకు ఉచిత భోజనం, రవాణా ఖర్చులు ఇస్తామన్నారు. స్థానిక ఇన్నీసుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్లో మంగళవారం జరిగే వైద్య శిబిరానికి రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, అనపర్తి, బిక్కవోలు, గోకవరం, కడియం, సీతానగరం, రాజానగరం, రంగంపేట, కోరుకొండ మండలాల నుంచి దివ్యాంగులు హాజరుకావాలన్నారు. దేవరపల్లి హైస్కూల్లో బుధవారం జరిగే శిబిరానికి చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, నల్లజర్ల, పెరవలి, ఉండ్రాజవరం మండలాల వారు రావాలన్నారు.

న్యూస్‌రీల్

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి, 1902 కాల్ సెంటర్‌కు వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ, ఇతర జిల్లా అధికారులతో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన ప్రజల నుంచి 113 అర్జీలు స్వీకరించారు. అనంతరం జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను ఆర్థిక, ఆర్థికేతర అంశాల వారీగా విశ్లేషణ చేసుకోవాలన్నారు. వాటిని గడువులోగా పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 400 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

వికాసలో టెక్నీషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో మంగళవారం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి ఐటీఐ ఫిట్టర్ ఒక సంవత్సరం అప్రంటీస్‌షిప్ (ఎస్‌సివిటీ) కలిగిన ఫ్రెషర్స్ అండ్ ఎక్స్‌పీరియన్స్‌డ్ పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వతేదీ మంగళవారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలతో హాజరుకావలెనని పీడీ వివరించారు.

జగన్మోహినీ కేశవ స్వామి దీక్షలు ప్రారంభం



27ఆర్‌పీపీ44: జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో దీక్షలు ప్రారంభించిన భక్తులు

ఆత్రేయపురం: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి దీక్షలను ఆలయంలో సోమవారం ప్రారంభించారు. కల్యాణోత్సవాల సందర్భంగా పలువురు భక్తులు ఏటా ఇక్కడ స్వామి వారి మాల వేసుకుంటారు. ఈ నెల 30 నుంచి జరిగే స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సుమారు 70 మంది మాలధారణ గావించారని ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. వారికి దేవస్థానం తరఫున దీక్షా వస్త్రాలు, మాలలు, మధ్యాహ్నం భిక్ష, ఉదయం సాయంత్రం పడి, వసతి ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 30 నుంచి వారం రోజుల పాటు జరిగే స్వామి వారి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

వంతెన నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

సాక్షి, అమలాపురం: పి.గన్నవరం మండలం గంటి పెదపూడి – ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. వంతెన నిర్మాణ పనులపై పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఏపీఈపీడీసీఎల్ అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. అనుకూలమైన ప్రాంతాల్లో లంకలకు పెద్ద వంతెన, కాలువ మీద చిన్న వంతెన నిర్మాణ పనులు చేయాలని సూచించారు. వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేలా భూసేకరణ విషయంలో రెవెన్యూ, అడ్డంగా ఉన్న హెచ్‌టీ లైన్ తొలగింపునకు విద్యుత్ అధికారులు సహకరించాలని ఆదేశించారు. కాలువలు మూసివేసిన తరువాత అవసరమైతే రావులపాలెం, పి.గన్నవరం మధ్య ట్రాఫిక్ మళ్లించి కాలువపై చిన్న వంతెన నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు.

ఒకటి నుంచి రబీ ధాన్యం కొనుగోలు

- పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి
- అధికారులతో జేసీ తేజ్‌భరత్



సమావేశంలో పాల్గొన్న జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రబీ ధాన్యం కొనుగోలుకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. ధాన్యం సేకరణ కార్యాచరణ, విద్య (పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు), స్పందన, గ్రామ, వార్డు సచివాలయ అంశాలు, వేసవిలో తాగునీటి సరఫరా తదితర అంశాలపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముందస్తుగా కోతలు జరిగే అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో షెడ్యూల్ ప్రకారం రోజువారీ ఎంత ధాన్యం వస్తుందో మండల సమన్వయ అధికారులకు అంచనా ఉండాలన్నారు. జిల్లాకు 70 లక్షల గన్నిబ్యాగులు అవసరమని, దానికి తగ్గట్టుగా ఏ మండలానికి ఎన్ని అవసరమో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో రబీ సీజన్లో 4,55,845 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 315 ఆర్‌బీకేలు ఉండగా, వాటిలో 233 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 147 మిల్లులకు అనుసంధానం చేశామన్నారు.

పదోతరగతి పరీక్షలపై..

జిల్లాలోని 126 కేంద్రాల్లో ఏప్రిల్ 3 నుంచి 18 వరకూ, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. వీటికి జిల్లా నుంచి 26,129 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 21 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ యంత్రం సేవాపథకం ద్వారా జిల్లాలో 173 సీహెచ్‌ఎస్ గ్రూపులను ఎంపిక చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 164 గ్రూపులను ఎంపిక చేసి, వారి ఖాతాలను బ్యాంకులతో అనుసంధానం చేశామన్నారు. త్వరలో 2వ విడత రాష్ట్ర వ్యాప్తంగా యంత్రం సేవాపథకం మెగా మేళా నిర్వహిస్తారని, ఈ మేరకు లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.

ప్రజారోగ్యానికి సర్కార్ అగ్రాసనం

104 వాహనాలను ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్



104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, చిత్రంలో వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో ప్రభుత్వం సమకూర్చిన మూడు 104 వాహనాలను సోమవారం రాష్ట్ర పర్యావరణ, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతపై సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఇందుకోసం భారీగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు,పీహెచ్‌సీలు, వంద పడకల ఆసుపత్రులను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. వైద్య సిబ్బందిని నియమిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య విషయంలో ఏమాత్రం శ్రద్ధ వహించలేదని విమర్శించారు. కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలపై పడి దోచుకుతింటున్నా చర్యలు చేపట్టేది కాదన్నారు. ఒక విధంగా కార్పొరేట్ ఆసుపత్రుల మాఫియాకు చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలిచేదన్నారు. ప్రస్తుతం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్యంతో పాటు పట్టణ, నగరాలలో వైద్య సదుపాయాలకు కోట్లాది రూపాయలు కేటాయిస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధితో పాటు ప్రభుత్వ వైద్య కళాశాలను రూ.100 కోట్లతో నిర్మిస్తోందన్నారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలున్నా అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలిన ఆయన ప్రజలకు సూచించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.సుధాకరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.మేరీలిడియా,104 జిల్లా కోఆర్డినేటర్ కిశోర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.శేషమణి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో మూడు నెలలు

- జూన్ 30 వరకు గడువు పెంపు
- జిల్లాలో రూ.3929.48లక్షల ఆదాయం
- పెండింగ్‌లో 2,261 దరఖాస్తులు
- ఇవి పరిష్కారమైతే మరింత రెవెన్యూ



కొవ్వూరు పురపాలక సంఘం కార్యాలయం

కొవ్వూరు: పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో మూడు నెలలు గడువు పొడించింది. ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) ఈ ఏడాది జనవరి 31వ తేదీతో ముగిసింది. ఈ గడువును జూన్ 30 వరకు గడువు పొడిగిస్తూ పురపాలక శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో పాటు కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాలు,రాజమహేంద్రవరం పట్టణాభివృద్ధి సంస్థ (రుడా)కు ఎల్ఆర్ ఎస్‌కు 4,540 దరఖాస్తులందాయి. వీటిలో 1,563 ఆమోదం పొందాయి. 238 దరఖాస్తులను తిరస్కరించారు. పెడింగ్‌లో ఉన్న 2,261 దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వ మరో మూడు నెలలు గడువు ఇచ్చింది. చిన్న చిన్న లోపాలన్న దరఖాస్తులు 366 ఉన్నాయి. 112 దరఖాస్తులకు సొమ్ము చెల్లించాలని సిఫారసు చేశారు. ఎస్‌ఆర్‌ఎస్ ద్వారా పురపాలక సంఘాలకు రూ.3929.48 లక్షల ఆదాయం సమకూరింది. పెడింగ్ దరఖాస్తులు కుడా పరిష్కారమైతే అదనపు ఆదాయం సమకూరనుంది.

మునిసిపాలిటీల వారీగా దరఖాస్తుల తీరు

మునిసిపాలిటీ	దరఖాస్తులు	అప్రూవ్డ్	తిరస్కరణ	లోపాలున్నవి	పెండింగ్
రాజమహేంద్రవరం	767	565	64	97	16
కొవ్వూరు	347	264	06	39	27
నిడదవోలు	136	109	0	07	10
రుడా	3,290	625	168	223	2,208

షార్ట్‌ఫాల్‌లో 366 దరఖాస్తులు

సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం, చిన్న చిన్న లోటుపాట్లు ఉన్న దరఖాస్తుదారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో 97, కొవ్వూరులో 39, నిడదవోలులో 7, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(రుడా) పరిధిలో 223 మంది దరఖాస్తుదారులకు అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. రాజమహేంద్రవరంలో 25 మంది, కొవ్వూరులో 11, నిడదవోలులో 10 దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాలని సమాచారం ఇచ్చారు. ఇవన్నీ క్లియరైతే కోట్లాది రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

పెండింగ్ దరఖాస్తులు

రుడా పరిధిలో 2,208 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 3,290 దరఖాస్తులు అందితే 625 ఆమోదం పొందాయి. 168 దరఖాస్తులకు సరైన పత్రాలు లేకపోవడంతో తిరస్కరించారు. ఇప్పటి వరకు రుడాకు రూ.1,196.5 లక్షల మేరకు ఆదాయం సమకూరింది. 2233 దరఖాస్తుదారులకు లోపాలను సరిచేసి సమర్పించాలని నోటీసులు ఇచ్చారు. 66 మంది సొమ్ము చెల్లింపు పెండింగ్ దశలో ఉంది.

పాత వారికే వర్తింపు



జిల్లాలో 2,261 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణకు కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం లేదు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే గడువు వర్తిస్తుంది. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం,చిన్నచిన్న లోపాలు గుర్తించి నోటీసులు పొందిన వారు సరిచేసి సొమ్ము చెల్లించాల్సి ఉంది. పెండింగ్ దరఖాస్తుదారులు అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి.

– ఎస్.శ్రీనివాస్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్

నేడు సత్యదేవుని హుండీ లెక్కింపు



ప్రధాన హుండీ నిండిపోవడంతో సీల్ వేస్తున్న సిబ్బంది

అన్నవరం: సత్యదేవుని ఆలయంలోని హుండీలను మంగళవారం లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 27న లెక్కించారు. 58 రోజుల తరువాత ఇప్పుడు లెక్కించనున్నారు. సుమారు రూ. 3 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రధానాలయంలోని ప్రధాన హుండీ కానుకలతో నిండిపోవడంతో ఈ నెల 14న సీల్ వేశారు. వివాహాల సీజన్ కారణంగా కొద్ది రోజులుగా ఆలయానికి భక్తులు పోటెత్తుతున్న విషయం తెలిసిందే. హుండీ లెక్కింపులో దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్ర శేఖర్ అజాద్, ఇతర సిబ్బంది పాల్గొంటారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే నెల 3వ తేదీ నుంచి జరిగే పదో పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జోన్‌–2 ప్రాంతీయ విద్య సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) జి.నాగమణి తెలిపారు. జోన్ పరిధిలోని ఏడు జిల్లాల విద్యా శాఖాధికారులు, పరీక్షల నిర్వహణాధికారులు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లతో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆమె సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బార్‌కోడింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. బార్‌కోడింగ్ విధానం అమలును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల మూల్యాంకనం చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లు, అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు 2007లో బార్‌కోడింగ్ విధానం ప్రారంభించారన్నారు.

ఈ విధానంలో సమాధాన పత్రం ఎవరిదో మూల్యాంకనం చేసేవారికి తెలియదని చెప్పారు. సమాధాన పత్రాలు గతంలో ఏ జిల్లాకు వెళ్లేవో తెలిసేవని, బార్ కోడింగ్ విధానంలో ఏ సమాధాన పత్రాలు ఎక్కడకు వెళ్తున్నాయన్నది తెలియదని, అలాగే బుక్‌లెట్ విధానం వలన మాస్ కాపీయింగ్‌కు కూడా అవకాశం లేదని వివరించారు. బార్ కోడింగ్, బుక్‌లెట్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓలకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారులు ఎస్.అబ్రహం (తూర్పు గోదావరి), కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ (కాకినాడ), ఆర్‌వీ రమణ (పశ్చిమ గోదావరి), తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి పరీక్షల కమిషనర్ ఎ.ఛాయాదేవి, ఏడీ కె.సుబ్బారావు, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ తిరుపతి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- రూ.55 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెల్లడి
- వాడపల్లి ఆలయం వద్ద వకుళమాత అన్నదాన సముదాయానికి శంకుస్థాపన
- రూ.5.5 కోట్లతో నిర్మాణం


అన్నదాన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


జగ్గిరెడ్డి చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న మన్యం భాను

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి రూ.55 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. దీని ఆమోదానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఆలయం పార్కింగ్ ప్రాంగణం వద్ద రూ.5.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వకుళ మాత అన్నదాన సముదాయానికి జగ్గిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పారు. సుమారు రూ.4 కోట్లతో ప్రాకార మండపాలు నిర్మించామని, ఆలయం చుట్టూ గ్రానైట్ వేయించామని గుర్తు చేశారు. పార్కింగ్ ప్రాంగణం వద్ద రూ.55 లక్షలతో కల్యాణ ప్రాంగణం నిర్మించామన్నారు. ఆలయం వద్ద ఉన్న చెరువును పుష్కరిణిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆలయ అభివృద్ధి విషయంలో తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. వాడపల్లి కొత్త బ్రిడ్జి వరకూ ఉన్న రోడ్డుకు విద్యుత్ స్తంభాలు, లైట్ల ఏర్పాటుకు రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) నుంచి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఆ పనులు కూడా అతి త్వరలోనే చేపట్టి, పూర్తి చేస్తామని చెప్పారు. వాడపల్లి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో జీతం లేని ఉద్యోగులుగా కష్టపడి పని చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యవర్గ సభ్యులతో పాటు ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు, సిబ్బందిని, సర్పంచ్ పోచిరాజు సూర్యకుమారిని జగ్గిరెడ్డి అభినందించారు.

ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీలు కుండ అన్నపూర్ణ, మార్గని గంగాధరం, టి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తొలి విరాళం రూ.1,01,116

వాడపల్లి ఆలయంలో వకుళమాత అన్నదాన పథకానికి తొలి విరాళంగా దేవస్థానం కమిటీ సభ్యులు మన్యం వెంకట నాగ సూర్యకుమారి, భాను దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు.

క్లుప్తంగా

రూ.10 లక్షల విలువైన టేకు కలప పట్టివేత


పట్టుబడిన టేకు కలప వ్యాన్‌తో అటవీ శాఖ సిబ్బంది

గోకవరం: అటవీ అధికారులు రూ.10 లక్షల విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం అటవీ శాఖ అధికారి ఎల్.ధనరాజ్ పర్యవేక్షణలో మండలంలోని జగన్నాథపురం వద్ద టేకు దుంగలు తరలిస్తున్న వ్యాన్‌ను సిబ్బంది ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వాహనాన్ని రాజమహేంద్రవరం అటవీ శాఖ కార్యాలయానికి తరలించి సోమవారం కలప లెక్కించారు. వ్యాన్‌లో 60 దుంగలు ఉండగా వీటి విలువ రూ.10 లక్షలుగా అంచనా వేశారు. ఈ కలపను అడ్డతీగల నుంచి జగ్గంపేట తరలిస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు రాజమహేంద్రవరం అటవీ శాఖాధికారి ఎల్.ధనరాజ్ తెలిపారు. దాడిలో డిప్యూటీ రేంజ్ అధికారి పద్మావతి, సెక్షన్ ఆఫీసర్ పి.వెంకట్రావు, ఎఫ్‌బీఓలు దాసరి కామేశ్వరరావు, ఐ.రాజారమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై ఆకస్మిక దాడి

మలికిపురం: లక్కవరం గ్రామం వద్ద రాజుగారి కొబ్బరి తోటలో ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. రాజోలు సీఐ ఆధ్వర్యాన జరిగిన ఈ దాడిలో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి సోమవారం తెలిపారు. నిర్వాహకుల నుంచి రూ.8.20 లక్షల నగదు, 15 కోళ్లు, 15 మొబైల్ ఫోన్లు, 5 కార్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

దీక్ష@నాలెడ్జ్ షేరింగ్

- 31 వరకూ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ
- హాజరు కాని వారిపై చర్యలు

రాయవరం: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన పద్ధతులను మెరుగు పరచుకుంటూ విద్యార్థులను విద్యాపరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. వారికి వృత్తిపరమైన మెళకువలు అందించేందుకు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ నాలెడ్జ్ షేరింగ్(దీక్ష)ను ఎన్‌సీఈఆర్‌టీ అందుబాటులోకి తెచ్చింది. పాఠశాల విద్యలో 'దీక్ష'ను జాతీయ వేదికగా చెప్పవచ్చు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ఉపాధ్యాయులకు టీచింగ్ – లెర్నింగ్ ఈ–కంటెంట్ అభివృద్ధి చేయాల్సి ఉంది. అభివృద్ధి చేసిన ఈ–కంటెంట్‌ను దీక్ష ప్లాట్‌ఫాంలో అప్‌లోడ్ చేసి, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. దీక్షతో పాటు ఇతర విద్యా కార్యక్రమాలను ప్రోత్సహించడానికి, విస్తరించడానికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ (సీఐఈటీ) బలోపేతం చేస్తారు. నేర్చుకున్న ఈ–కంటెంట్‌ను ఉపాధ్యాయులు బోధన – అభ్యసన పద్ధతుల్లో సముచితంగా అనుసంధానించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఐదు గంటల ఆన్‌లైన్ శిక్షణ

బోధన, అభ్యసన, మూల్యాంకనంలో దీక్ష వినియోగంపై 'దీక్ష' ప్లాట్‌ఫాం ద్వారా ఐదు గంటల పాటు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ రోజుకు ఒక గంట చొప్పున ఈ శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 18 వేల మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు, విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలు, సమగ్ర శిక్షా సిబ్బంది ఈ ఆన్‌లైన్ శిక్షణ తీసుకోవాల్సి ఉంది.

ఎవ్వరికీ మినహాయింపు లేదు. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ లైవ్ సెషన్‌లో ఈ శిక్షణకు హాజరు కావాలి. ఇప్పటికే లైవ్ సెషన్ వీక్షించడానికి అవసరమైన వెబ్‌సైట్ లింక్‌లను ఉపాధ్యాయులకు పంపించారు.

ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పంపిణీ

ఐదు రోజుల శిక్షణ అనంతరం ఈ నెల 31న ఒక వెబ్ లింక్ పంపిస్తారు. దీని ద్వారా ఐదు రోజుల పాటు, ఐదు గంటల్లో నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఒకే ప్రయత్నంలో 70 శాతం స్కోర్ సాధించిన వారి మెయిల్ అడ్రస్‌కు ఆన్‌లైన్ సర్టిఫికెట్ పంపిస్తారు. ఈ అసెస్మెంట్ లింక్ ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 21వ తేది 6 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. అలాగే కోర్సుపై ఫీడ్ బ్యాక్ పంపించేందుకు కూడా లింక్‌ను అందుబాటులో ఉంచారు. లైవ్ సెషన్లకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



ప్రతి ఉపాధ్యాయుడూ దీక్ష ఆన్‌లైన్ శిక్షణ పొందాల్సి ఉంది. దీని ద్వారా బోధనాభ్యసన పద్ధతులను మెరుగు పరచుకునే వీలుంది. వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఇది దోహదం చేస్తుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, సీఆర్‌పీలు, సమగ్ర శిక్షా సిబ్బంది అందరూ శిక్షణ పొందాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ విజేత సునీల్


సునీల్

ఉప్పలగుప్తం: యునెక్స్ 45వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–23 పోటీల్లో ఉప్పలగుప్తం మండలం కూనవరానికి చెందిన ఆకుల వెంకటరాజు (సునీల్) విజేతగా నిలిచాడు. గోవాలో ఇటీవల జరిగిన ఈ పోటీల డబుల్స్ విభాగంలో సునీల్ జోడీ విజేతగా నిలిచింది. ఈ విజయం ఎంతో సంతోషంగా ఉందని సునీల్ స్థానిక విలేకర్లకు ఫోనులో తెలిపారు.

దేవస్థానం ప్రతిష్టను ఇనుమడింపజేయాలి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- రత్నగిరిపై ట్రస్ట్‌బోర్డు సభ్యులకు ఘనంగా సన్మానం


సభలో ప్రసంగిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ప్రతిష్ట ఇనుమడించేలా ధర్మకర్తల మండలి సభ్యులు వ్యవహరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులకు పరిచయ కార్యక్రమం పేరుతో సోమవారం రత్నగిరిపై అభినందన సభ నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ, దేవాలయాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా పక్షపాతి అని, అందువల్లనే ట్రస్ట్‌బోర్డు సభ్యుల్లో సగం మందికి పైగా ఆయా వర్గాల వారినే నియమించారని అన్నారు. సభ్యులు సమర్థంగా పని చేసి, భక్తులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ, దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలని కోరారు. దేవస్థానానికి త్వరలోనే కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' స్కీం కింద రూ.55 కోట్లు మంజూరు కానున్నాయన్నారు. ఆ నిధులతో అన్నదాన భవనం, వ్రత మండపాలు, కొండ దిగువన డార్మెట్రీ, ఇతర నిర్మాణాలు చేపడతారని వివరించారు. అనంతరం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఐవీ రోహిత్, సభ్యులు కొత్తెం పశువులరావు, తాడి రజని, దళే వీర సూర్యనారాయణ, నక్కా అశ్వని, సాపిశెట్టి భూలక్ష్మి, పేరూరి బద్రీనారాయణ, బొడ్డాని విజయలక్ష్మి, నున్న నరసింహరావు, కడియాల లక్ష్మణరావు, కర్రి భామిరెడ్డి, రాయుడు సూర్యావతి, కేవీ నాగేశ్వరరావు, నేతల వెంకటలక్ష్మి, కారుకోడి పోచమ్మ, ట్రస్ట్‌బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యుడు, దేవస్థానం ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధ్యాయినులకు గాయాలు


యానాం బైపాస్ రోడ్డులో బైక్‌ను ఢీకొన్న కారు

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధ్యాయినులు గాయపడ్డారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన ఎల్.చంద్రావతి, సుభద్ర, వి.జయలక్ష్మి, నీరజ ఇంజరం హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరు రోజూ ఆటోలో పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. అదేవిధంగా సోమవారం వెళ్తుండగా, జాతీయ రహదారి 216పై లచ్చిపాలెం వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి, ఆగి ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభద్ర చేయి విరిగిపోయింది. మిగిలిన వారు కూడా గాయపడ్డారు. వారిని హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఫోన్‌లో పరామర్శించారు. ఇదిలా ఉండగా ఆటో ఢీకొన్న కారు కూడా ప్రమాదానికి గురైంది కావడం గమనార్హం. ఆదివారం రాత్రి యానాం బైపాస్ రహదారిలోని పెట్రోల్ బంకు నుంచి ద్విచక్ర వాహనంపై యానాం వెళుతున్న యాళ్ల సతీష్ అనే యువకుడిని ఎదురుగా వస్తున్న ఆ కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్ తల, కాళ్లపై తీవ్రగాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస కుమార్ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు మణికంఠ నాయుడు (పాతచిత్రం)

పాలకొల్లు అర్బన్: దిగమర్రు – చించినాడ మధ్య 216 జాతీయ రహదారిపై దిగమర్రు వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పెనుమాల గ్రామానికి చెందిన ఈలి మణికంఠనాయుడు (32) మృతి చెందారు. భార్య రామదుర్గతో కలిసి పాలకొల్లులో బంధువుల ఇంటికి వివాహానికి హాజరై తిరిగి వెళుతూండగా ఆయన ఈ ప్రమాదానికి గురయ్యారు. చించినాడ వైపు మోటార్ సైకిల్‌పై వెళుతున్న వీరిని ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన రామదుర్గ పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హోల్‌సేల్ చికెన్ వ్యాపారి మణికంఠనాయుడుకు వివాహమై 46 రోజులైందని బంధువులు తెలిపారు. మణికంఠనాయుడు చిన్నాన్న కాశీ విశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీఎం మూర్తి తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డులో లారీ ఢీకొని గుర్తు తెలియని మహిళ (65) దుర్మరణం పాలైంది. అచ్చంపేట జంక్షన్ నుంచి సూర్యారావుపేట లైట్‌హౌస్ వైపు వెళ్లే మార్గంలో పాముగుంట వద్ద సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై నడిచి వెళ్తున్న ఆ మహిళను వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె శరీరం నుజ్జునుజ్జయింది. వీఆర్‌ఓ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడే కడతేర్చాడు

- వేములూరు ఉప సర్పంచ్ హత్య కేసులో ఇద్దరి అరెస్టు
- 24 గంటల వ్యవధిలోనే మిస్టరీ ఛేదించిన పోలీసులు
- ఆర్థిక లావాదేవీలే కారణమని నిర్ధారణ


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వర్మ, సీఐ ఏఎల్ఎస్ రవికుమార్

కొవ్వూరు: వేములూరు ఉప సర్పంచ్ శీని సత్య వరప్రసాద్‌ను ప్రస్తుతం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఉంటున్న అతని తమ్ముడు సత్యనారాయణే హతమార్చాడని పోలీసులు నిగ్గు తేల్చారు. ఇద్దరి మధ్యా ఆర్థికపరమైన వివాదాలే ఈ హత్యకు దారి తీసినట్టు వారి విచారణలో నిర్ధారణ అయ్యింది. కొవ్వూరు సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ప్రస్తుతం వేములూరులో ఉన్న ఇంటి దస్తావేజులను అనపర్తికి చెందిన వారికి ప్రసాద్, సత్యనారాయణ 2018లో తనఖా పెట్టి, రూ.7.50 లక్షల అప్పు తీసుకున్నారు. అందులో రూ.2 లక్షలు తమ్ముడు సత్యనారాయణకు ఇచ్చి, మిగిలిన సొమ్మును ప్రసాద్ తీసుకున్నాడు. తీసుకున్న డబ్బు కోసం అనపర్తికి చెందిన వ్యక్తి ఒత్తిడి చేయడంతో వేములూరుకు చెందిన ప్రసాద్ స్నేహితుడు అక్కిన రాంబాబు (శివరామకృష్ణ) ఆ బాకీ చెల్లించారు. దీనికోసం రూ.4.5 లక్షలు ఇచ్చి, ఇంటిని తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో తన వాటాను పంచాలంటూ ప్రసాద్‌పై సత్యనారాయణ ఒత్తిడి తెస్తున్నారు. తల్లి చనిపోయిన సమయంలో దినకర్మలకు, తీసుకున్న రూ.2 లక్షలకు వడ్డీ, ఇంటికి గోడ కట్టినందుకు, ప్రస్తుత తనఖా బకాయి కలిపి రూ.19.5 లక్షలైందని, ఆ సొమ్ము ఇవ్వాలని సోదరుడికి ప్రసాద్ సూచించారు. తాను అంత సొమ్ము ఇవ్వలేనని సత్యనారాయణ చెప్పాడు. ఇంటి వాటా, అప్పు తీర్చే విషయంలో అన్నదమ్ములిద్దరూ 15 రోజులుగా గొడవ పడుతున్నారు. తనకు జంగారెడ్డిగూడెంలో ఉన్న స్థలం అమ్మి, కొంత సొమ్ము ఇస్తానని సత్యనారాయణ చెప్పినప్పటికీ ప్రసాద్ ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో అన్నపై తమ్ముడు కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం కొవ్వూరు చేరుకున్న సత్యనారాయణ వేములూరుకు చెందిన తన మిత్రుడు గెడా శ్రీనుకు ఫోను చేసి, తన వద్దకు రప్పించుకున్నాడు. ఇద్దరూ కలిసి వేములూరు సమీపంలోని ఓ బార్‌లో మద్యం తాగారు. అనంతరం సత్యనారాయణను శ్రీను మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని ప్రసాద్ ఇంటి వద్ద దింపాడు. ఆ సందర్భంగా అన్నదమ్ములిద్దరి మధ్య ఆర్థిక అంశాలపై మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో ప్రసాద్ గొంతు నులిమి, తల గోడకేసి కొట్టి తమ్ముడు సత్యనారాయణ హతమార్చాడు. హత్య జరుగుతున్న సమయంలో గెడా శ్రీను బయట కాపలాగా ఉన్నాడు. ప్రసాద్‌ను హతమార్చిన అనంతరం సత్యనారాయణను శ్రీను మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి కొవ్వూరులో విడిచిపెట్టాడు. అక్కడి నుంచి సత్యనారాయణ జంగారెడ్డిగూడెం వెళ్లిపోయాడు. హతుడు ప్రసాద్ భార్య, పిల్లలు చాన్నాళ్లుగా జంగారెడ్డిగూడెంలో ఉంటున్నారు. ప్రసాద్‌ను ఎవరో హత్య చేసినట్టు వేములూరు నుంచి ఫోను ద్వారా సమాచారం రావడంతో ప్రధాన నిందితుడు సత్యనారాయణ ఏమీ తెలియనట్టుగా సోమవారం ఉదయం జంగారెడ్డిగూడెం నుంచి వదిన, అన్న పిల్లలను తీసుకుని వేములూరు వచ్చాడు. కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు అనుమానం రాకుండా ఉండేందుకు సాయంత్రం అన్న అంత్యక్రియలు ముగిసే వరకూ అక్కడే ఉన్నాడు. ఫోన్ లొకేషన్, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేశారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణను, అతడికి సహకరించిన శ్రీనును అరెస్టు చేశారు. హత్య చేసిన సమయంలో సత్యనారాయణ చొక్కాపై రక్తపు మరకలయ్యాయి. ఆ చొక్కాతో పాటు నిందితులు ఉపయోగించిన మోటారు సైకిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్, ఎస్సైలు కేవీ రమణ, పి.రవీంద్రబాబు, బి.దుర్గాప్రసాద్, ఇతర సిబ్బందిని డీఎస్పీ వర్మ అభినందించారు.

పీడీ అసభ్య ప్రవర్తన!

- విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

మామిడికుదురు: అప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ పి.సురేష్ బాబు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. పీడీ సురేష్‌బాబు ఆరో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అతడి తీరుపై విద్యార్థిని కుటుంబ సభ్యులు ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబుకు ఇటీవల ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం సాయిబాబు ఈ సమస్యను సర్పంచ్ గెద్దం మంగాదేవి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ గత నెల 21 నుంచి ఈ నెల 21వ తేదీ వరకూ పీడీతో సెలవు పెట్టించారు. ఈ నెల 24, 25 తేదీల్లో కూడా పీడీ సెలవు పెట్టారు. తిరిగి సోమవారం నుంచి సురేష్‌బాబు విధులకు హాజరు కావడంతో నివురు గప్పిన నిప్పులా ఉన్న సమస్య భగ్గుమంది. విద్యార్థిని నడుముపై చేయి వేయడం, వారికి తెలియకుండా వీడియోలు తీయడం, ఈమె మీ పిన్ని అంటూ విద్యార్థినులకు పరిచయం చేయడం వంటి అనైతిక చర్యలకు పీడీ పాల్పడ్డాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే పిల్లల్ని ఎలా చదివించాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీడీ అసభ్య ప్రవర్తనకు సంబంధించి ఏడెనిమిది ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. తల్లిదండ్రుల ఆందోళన నేపథ్యంలో పీడీని హెచ్‌ఎం సోమవారం స్కూల్ నుంచి పంపించి వేశారు. పీడీ సురేష్ బాబు గతంలో పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసిన సమయంలో కూడా ఇదే విధంగా అసభ్యంగా ప్రవర్తించేవాడని చెబుతున్నారు. పీడీ సురేష్‌బాబు వ్యవహారంపై హెచ్‌ఎం సాయిబాబును వివరణ కోరగా తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమని చెప్పారు. అతడిని సెలవుపై పంపించామన్నారు. పీడీని ఇక్కడి నుంచి బదిలీ చేయిస్తామని సర్పంచ్ మంగాదేవితో పాటు పెద్దలు హామీ ఇచ్చారని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. విధి నిర్వహణలో కచ్చితంగా ఉంటున్నందు వల్లనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పీడీ సురేష్ బాబు 'సాక్షి'కి చెప్పారు. దీనిపై ఎంఈఓ కోన హెలీనాను 'సాక్షి' సంప్రదించగా.. హెచ్‌ఎం ద్వారా వివరాలు తెలుసుకున్నానని, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు.